# శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్య

శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య 1974 వ సంవత్సరం జూలై 2 వ తేదీ న శాసన పరిషత్తు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై 1978 వ సంవత్సరం మార్చి 28 వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

వీరు 1910 వ సంవత్సరం నవంబరు 24 వ తేదీన కర్నూలు జిల్లా పత్తికొండలో జన్మించారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి బి.ఎ. పట్టా పొందారు.

శ్రీ సుబ్బయ్య ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. గాంధీజీ పిలుపునందుకొని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్ర్యోద్యమంలోకి ప్రవేశించారు. జాతీయోద్యమ కాలంలో ఎ.ఐ.సి.సి. సభ్యునిగా, పి.సి.సి. ప్రధాన కార్యదర్శిగానే కాక, పి.సి.సి. కార్యవర్గ సభ్యునిగా శ్రీ ప్రకాశం, శ్రీ పట్టాభి సీతారామయ్య, శ్రీ బులుసు సాంబమూర్తి, శ్రీ కొండా వెంకటప్పయ్య వంటి మహనీయులతో కలసి పనిచేసారు. 1940 వ సంవత్సరంలో కర్నూలులో వ్యక్తి సత్యాగ్రహం చేసి 8 నెలలు వెల్లూరు, ఆలీపురం జైళ్ళలో కఠిన కారాగార శిక్షను అనుభవించారు. 1942 వ సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు.

శ్రీ సుబ్బయ్య 1946 వ సంవత్సరం నుండి 1952 వ సంవత్సరం వరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసన సభ సభ్యులుగా ఉన్నారు. 1958 వ సంవత్సరం జూలై 1వ తేదీ నుండి 1964 వ సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి, 1968 వ సంవత్సరం జూలై 10 వ తేదీ నుండి 1974 వ సంవత్సరం జూన్ 30వ తేదీ వరకు నామినేటెడ్ సభ్యులుగాను, 1974 వ సంవత్సరం జూలై 1 వ తేదీ నుండి 1978 వ సంవత్సరం మార్చి 28 వ తేదీ వరకు శాసన సభ నియోజకవర్గం నుండి శాసన పరిషత్తు సభ్యులుగా ఉన్నారు.

వీరు 1959 - 60, 1969 - 70 సంవత్సరాలలో అంచనాల సమితి సభ్యులుగా, 1961 ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బిల్లు, 1962 ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితీలు, జిల్లా పరిషత్తుల బిల్లులకు విశిష్ట సమితి సభ్యులుగా మరియు 1969-70 సంవత్సరాల మధ్యకాలంలో రాష్ట్ర గ్రంధాలయాల సమితి, 1972-73,

1973-74 సంవత్సరాల మధ్యకాలంలో ప్రభుత్వ రంగ సంస్థల సమితి సభ్యులుగా పనిచేసారు.

వీరు 1972-1973 సంవత్సరాల మధ్యకాలంలో రాయలసీమ అభివృద్ధి మండలి అధ్యక్షులుగా, రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పథకం సమితి సభ్యులుగా, మద్య నిషేధ మండలి సభ్యులుగా కూడా పనిచేసారు.

శ్రీ సుబ్బయ్య కర్నూలు జిల్లాలో సహకారోద్యమానికి ఆద్యులు. నంద్యాలను ఆధునిక పట్టణంగా రూపొందిచడంలో వీరి కృషి ప్రధానమైనది. మద్రాసు, ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల సెనేట్ సభ్యులుగా పనిచేసారు. రాయలసీమలో విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసారు. నంద్యాలలో పలు విద్యా సంస్థలను నెలకొల్పారు.

శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు 1932 వ సంవత్సరంలో స్థాపించిన "స్వరాజ్య" అనే పత్రికకు ఉప సంపాదకులుగా, "ది హిందూ" దిన పత్రికకు విలేఖరిగా పనిచేసారు. 1953 వ సంవత్సరము నుండి 1955 వ సంవత్సరం వరకు "మనసీమ' ' అనే తెలుగు వార్త పత్రికకు సంపాదకులుగా మరియు ప్రచురణకర్తలుగా ఉన్నారు.

రాయలసీమను తరతరాల కరువుబారి నుండి కాపాడటానికి అనేక పథకాలు, నివేదికలు రచించారు.

వీరు "రాయలసీమ స్పీక్స్" అనే పుస్తకాన్ని రచించారు.

వీరు 1974 వ సంవత్సరం సెప్టెంబరులో కొలంబోలో జరిగిన ఇరవయ్యొవ కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సుకు హాజరయ్యారు.

రాయలసీమ ప్రాంత బహుముఖాభివృద్ధికి అవిరళంగా కృషిచేసిన ధీశాలి అయిన శ్రీ సుబ్బయ్యగారు 1978 వ సంవత్సరం మార్చి 28 వ తేదీన మరణించారు.